'కాంతమ్మగారి కోడలు నీళ్ళోసుకుందట.' ఊరంతా ఒక్కసారి గుప్పుమంది. అంతగా గుప్పుమనాల్సిన అనసరమేమీ లేదు. పెళ్ళయినావిడ నీళ్ళోసుకోవడంలో విడ్డూరమేమీ లేదు. కాని కాంతమ్మ కోడలు శకుంతల పెళ్ళయిన పన్నెండేళ్ళకు నీళ్ళోసుకుందం టే ఊళ్ళో అమ్మలక్కలందరికి ఉబుసుపోకకి మంచి విషయం దొరికింది. శకుంతల పూజలు, కాంతమ్మ దాన ధర్మాలు ఫలించాయని కొందరు, శాస్త్రులుగారి జ్యోతిష్యం అక్షరాలా నిజమయిందని కొందరు చెప్పుకున్నారు. ఈ వార్త విని రహస్యంగా శకుంతల శీలాన్ని శంకించిన కుళ్ళు మనుష్యులు కూడా లేకపోలేదు. కాకపోతే శకుంతల దొడ్డ ఇల్లాలని పేరుతెచ్చుకోవడం వల్ల, ఆమె గట్టిగా మాట్లాడడం కూడా ఎవరూ వినకపోవడం వల్ల ఆ మాట పైకి అనడానికి వాళ్ళకు ధైర్యం చాలింది కాదు.

శకుంతల కలవాళ్ళింట పుట్టింది. పసుపు, తేనె గులాబీలు కలిపి రంగరించిన రంగులో వుంటుంది. లేత తమలపాకులా సుకుమారంగా, వెన్నెలలాంటి చిరునవ్వుతో అందర్నీ ఆకట్టుకుంటుంది శకుంతల. ఎవరినీ నొప్పించని మనస్తత్వం. ఒకరి కష్టాన్ని చూచి జాలి, సానుభూతితో కదలిపోయి వాళ్ళకు సహాయపడే ఔదార్యం శకుంతలకు బంధువులందరిలో ఒక ప్రత్యేక స్థానాన్ని తెచ్చిపెట్టాయి.

ఫోర్తుఫారం చదువుతూ వుండగా శకుంతల వ్యక్తురాలయింది. ఎంతో ఆసక్తితో చదువుతూ మంచి మార్కులతో పాసవుతున్న శకుంతల చదువు కేవలం ఆడపిల్ల కావడం వల్ల ఆగిపోయింది. ఇరవయ్యో శతాబ్దపు ఉత్తరార్థంలో మూర్ఖపు ఆచారాలకు బానిసలయిన తల్లిదండ్రుల నెదిరించలేక శకుంతల చదువు మానేసింది. మళ్ళీ తల్లిదండ్రుల్ని ఎదిరించలేక వరసకు బావ



అయిన చంద్రాన్ని పెళ్ళి చేసుకుని అతని అవకతవకల్ని భరించడానికి సిద్ధపడింది.

కొడుకు—చెడుసావాసాలకి అలవాటు పడినా, కోడలు తన మంచితనంతో అతణ్ణి సన్మార్గంలోకి మళ్ళించ గలదని ఆశపడింది కాంతమ్మ. చంద్రం పుట్టిన రెండుసంవత్సరాలకే భర్తపోగా చంద్రాన్ని కనురెప్పలా సాకింది. ఆవిడ అతి గారాబంతో అతను వయసుకి మించిన అలవాట్లకు బానిసయ్యాడు. కోడలి కడుపున నలుగురు పిల్లలు పుట్టి నట్టింట నడయాడుతూంటే చూసి సంతోషించాలని కాంతమ్మ ఉబలాట పడింది.

పెళ్ళయిన వెంటనే బండెడు సారెతో కాపురానికి వచ్చింది శకుంతల. కాంతమ్మ కోడలు చక్కని చుక్క అని చెప్పుకున్నారు ఊరు ఊరంతా. ఆమె కట్టే రంగు రంగుల చీరల్ని, రకరకాల నగల్ని చూడడానికి గుంపులు గుంపులుగా వచ్చేవారు ఆడపిల్లలంతా. కాంతమ్మ వాళ్ళందరికీ కోడల్ని అపురూపంగా చూపించి, తాంబూల మిచ్చి పంపించేది. ఎప్పుడూ కొడుకు కనుసన్నలలో కోడల్ని వుంచేది కాని ఇంట్లో చిన్న [illegible]ముట్టుకో నిచ్చేది కాదు.

పెళ్ళయి కాపురాని[illegible]దేళ్ళయినా కోడలు నీళ్ళోసుకోక పోవడంతో కాంతమ్మ చాలా నిరాశ పడిపోయింది. శాస్త్రులుగారిని పిలిపించి శకుంతలది, చంద్రానిదీ జాతకం వ్రాయించి వాళ్ళకు సంతాన యోగం వుందో లేదో చూడమంది. శాస్త్రులుగారు జ్యోతిష్యంలో ఉద్దండుడు. ఆయన నోటి మాట అక్షరాలా జరిగి తీరుతుందనే నమ్మకముంది ప్రజల్లో. ఆయన జాతకాలు చూసి ముగ్గురు మనుమలు, ఇద్దరు మనుమరాండ్రు పుట్టితీరుతారని ఘంటాపథంగా చెప్పడంతో కాంతమ్మ ముఖం చేటంతయింది.

శాస్త్రులుగారు జ్యోతిష్యం చెప్పిన రెండు నెలలకి శకుంతల బయట చేరాల్సిన టైమ్‌కు చేరలేదు. పదిహేను రోజులు గడిచినప్పటినుంచీ కాంతమ్మ కోడల్ని వికారంగా వుంటోందా అని, కళ్ళు తిరుగుతున్నాయా అని, అన్నం సయిస్తూందా అని, నడుము లాగుతూందా అని—రకరకాల ప్రశ్నలతో వేధించేది. శకుంతల అదేమీ లేదంటే ఉసూరు మనేది. రెండోనెల దాటగానే యింక ఆగలేక కొడుకుని, కోడల్ని పట్నంలో లేడీ డాక్టర్ దగ్గరికి ప్రయాణం చేయించింది.

చంద్రానికి పిల్లలు, రోగాలు, రొష్టులు అంటే ఎంత అసహ్యమున్నా, డాక్టర్ల చుట్టూ తిరగడమెంత న్యూసెన్స్ అనిపించినా తల్లి మరీమరీ పోరాడడంతో శకుంతలని వెంట పెట్టుకుని వెళ్ళక తప్పిందికాదు.

లేడీ డాక్టర్ శకుంతలని పరీక్ష చేసి, ఆమె గర్భిణి కాదని చెప్పింది. శకుంతలలో ఏ లోపమూ లేదని, చంద్రం కూడా 'సీమెన్ ఎనాలిసిస్', బ్లడ్ వి. డి. ఆర్. ఎల్ మొదలైన పరీక్షలు చేయించుకున్నాక అతనిలో ఏ లోపమూ లేకపోతే అప్పుడు 'డి అండ్ సి' అనే చిన్న ఆపరేషన్ చేస్తానని చెప్పింది. అప్పటి వరకు కొన్ని మందులు వాడమని వ్రాసిచ్చింది.

డాక్టర్ శకుంతలని గర్భిణి కాదనడం కాంతమ్మకు పెద్దషాక్ నిచ్చింది. దానికి తగ్గట్టు డాక్టర్‌కి చూపించుకొచ్చిన మర్నాడే శకుంతల బయట చేరింది. డాక్టర్ చెయ్యి పాడు చెయ్యి అని, అంటేనే ఆవిడ చెయ్యి పడగానే పండంటి కొడుకు నెత్తుకోవలసిన కోడలు బయట చేరిందని డాక్టర్ని తిట్టి పోసింది కాంతమ్మ. కాంతమ్మ ఆర్భాటం చూశాక శకుంతలకి కూడా యింక తనకు పిల్లలు పుట్టరేమోనని దిగులేసింది.

డాక్టర్ వ్రాసిన మందులు శకుంతలకి మాత్రమే కొనుక్కొచ్చాడు చంద్రం. 'మీరు మందులు తెచ్చుకోలేదేం?' అని శకుంతల చంద్రాన్ని అడిగితే 'నాకేం జబ్బు లేదు, నేనెందుకు మందులు మింగడం?' అని దబాయించిపారేశాడు. 'పోనీ, డాక్టరమ్మ ఏవో పరీక్షలు చేయించుకోమంది కదా, చేయించుకొచ్చాక అవసరమయితే నేను ఆపరేషన్ చేయించుకుంటాన'న్నది శకుంతల. 'ఛత్! నాకే పరీక్షలూ అఖ్ఖర్లా. కావాలంటే నువ్వు ఆవిడ చుట్టూ తిరిగి వంద ఆపరేషన్లూ, వెయ్యిపరీక్షలూ చేయించుకో. నేనేమీ పిల్లలు కావాలని కొట్టుకుపోవడం లేదు' అని విసిరించేసాడు. అతను మంచి మూడ్స్‌లో ఉన్నప్పుడు మళ్ళీ ఒకటి, రెండుసార్లు చెప్పి చూచింది శకుంతల. తెయ్యిమని లేచి, 'మళ్ళీ ఆ ఊసెత్తావంటే మర్యాద దక్కదు' అని బజార్లోకి చరచరా వెళ్ళిపోతున్న భర్త వంక విరక్తిగా చూచింది శకుంతల. మన ప్రయత్నం మనం చేసి ఆనక పిల్లలు పుట్టకపోతే మన ఖర్మ అనుకుని ఆ గొడ్రాలితనాన్ని జీవితాంతమూ భరించవచ్చు. కాని మూర్ఖంగా అసలు పరీక్షే చేయించుకోకుండా, మందులే పడకుండా అలా చెయ్యడం తన మగతనానికి అవమానం అన్నట్లుగా ప్రవర్తిస్తున్న చంద్రాన్ని చూస్తే చెడ్డ చిరాకేసేది శకుంతలకి. చివరకు అత్తగారు చెప్తేనన్నా భర్త వింటాడేమోనన్న ఆశతో డాక్టర్ చెప్పిన విషయం కాంతమ్మతో చెప్పింది శకుంతల. ఆ డాక్టరమ్మ అంటేనే మండి పోతున్న కాంతమ్మ ఆవిడకి మరో నాలుగు అక్షింతలేసి 'నాకొడుక్కేం ఖర్మే— పరీక్షలూ గట్రా చేయించుకుని మందులు మింగడానికి? మగ మహారాజు. వాడికేంటి' అని వీరంగాలు పలకడంతో శకుంతల మరీ దిగాలు పడిపోయింది.

అక్కడికి, 'కొడుక్కే లోపమూ లేదంటే తనదే లోపమంతానని కదూ ఆవిడ ఉద్దేశ్యం—' సన్నటి సెగలాటి కసి బయల్దేరింది శకుంతలలో. స్వతహాగా మితభాషిణి అవడంవల్ల ఎక్కువ తర్కించకుండా వాళ్ళ అహంకారాన్ని, మూర్ఖత్వాన్ని మౌనంగా భరించడానికి సిద్ధపడింది.

సంవత్సరాలు గడిచినకొద్దీ కోడలు నీళ్ళోసుకోలేదనే దుగ్ధ ఎక్కువై ఆ అసంతృప్తిని ఏదో ఒక రూపంలో వెల్లడించేది కాంతమ్మ. అసలే పిల్లల కోసం తపించిపోతున్న శకుంతల ఈటెల్లాంటి అత్తగారి మాటలకు మరీ క్రుంగిపోయేది. క్రమంగా బ్రతుకంటే ఓ విధమైన నిర్లిప్తత, సంసారమంటే విరక్తి, చుట్టూ వున్న మనుషులంటే విసుగూ పుట్టుకొచ్చాయి శకుంతలకి. బంగారు బొమ్మల్లా వున్న పిల్లల్ని చూసి ఆనందంలో మైమరచిపోయినా మరుక్షణం ఆ పిల్లల తల్లుల్ని చూసి ఈర్ష్యతో కాలిపోయేది. తన దురదృష్టాన్ని తలచుకుని, తలచుకుని ఏడ్చేది.

కాంతమ్మకు ఓ రోజు మరీ పిచ్చిపిచ్చిగా వుంది. శాస్త్రులుకోసం కబురు పంపింది. 'ముగ్గురు మనుమలు, ఇద్దరు మనుమరాళ్ళు పుడతారన్నావు. ఎక్కడ తగలడ్డారు వీళ్ళంతా? మళ్ళీ ఒకసారి జాతకాల్ని సరిగా చూసేడువ్' అని ఆయన మీదకు విజృంభించడంతో ఆయన జాతకాల్ని రెండుగంటలు పరీక్ష చేసి, లెక్కలుకట్టి గ్రహాల స్థితి బాగా చూసి కాంతమ్మ కోడలు గనుక ఆరు నెలలలోగా నీళ్ళోసుకోకపోతే తను తన పిలకను కోయించుకుని జ్యోతిష్యం చెప్పడం వదిలేస్తానని శపథం పట్టాడు. తన కోడలే గనక నీళ్ళోసుకుని పండంటి పిల్లాణ్ణి కంటే ఆ మరుక్షణం శాస్త్రులు రెండు చేతులకీ మూడేసి తులాల బంగారంతో కంకణాలు చేయిస్తానని శపథం పట్టింది కాంతమ్మ.

శాస్త్రులుగారు చెప్పినట్లుగానే ఆరునెలలలో శకుంతలకి నెల తప్పింది. 'నా శపథం

నెరవేరింది. యింక నీ శపథం నెరవేరడమే తరువాయి' అని కాంతమ్మతో చెప్పి పిలక ఝూడించి ముడేసుకున్నాడు శాస్త్రులు. యింక కాంతమ్మ ఆర్భాటం యింతా అంతా కాదు. రకరకాల ప్రశ్నలతో శకుంతలని ఊపిరాడనిచ్చేది కాదు. శకుంతలకి అత్తగారడిగినవన్నీ తనకి ఉన్నట్లుగానే అనిపించేది. వికారంగా వుండి అన్నం సయించేది కాదు. కాంతమ్మ ప్రశ్న లెక్కువయిన రోజున వాంతులు కూడా అయేవి. రొమ్ములు నొప్పిగా వుండి పిండితే పాలు వచ్చేవి. కాంతమ్మ కోడల్ని కాలు క్రింద పెట్టనివ్వకుండా రకరకాల పిండివంటలు చేసి వద్దన్నా వినకుండా పెట్టేది. కోడిగ్రుడ్లు, పండ్లు తప్పనిసరి. మూడో నెల వెళ్ళి నాలుగోనెల వచ్చేసరికి శకుంతల వంట్లో నిగారింపు వచ్చింది. ప్రక్కలు పూడాయి. ముఖంలో క్రొత్తకాంతి, ఉత్సాహం వచ్చాయి.




ఒకసారి పట్నం వెళ్ళి లేడీడాక్టర్‌తో పరీక్ష చేయించుకోవాలని ఎంతో వుంది శకుంతలకి. డాక్టర్ పేరు వినగానే తాడిప్రమాణాన లేచింది కాంతమ్మ. మంత్రసాని మంగమ్మ చెయ్యి చలవైనది, దానికి పురుళ్ళుపొయ్యడంలో ముప్పైఏళ్ళ సర్వీసుంది, దానికన్నా యీ కుర్ర డాక్టరమ్మలకేం తెలీదు గాక తెలీదు పొమ్మంది. మంగమ్మను పిలిపించి కోడల్ని పరీక్ష చెయ్యమంది. పక్కలు నొక్కి, రొమ్ములు నొక్కి శకుంతల నీళ్ళోసుకోవడంలో ఏ మాత్రం అనుమానం లేదని నిర్ధారించింది మంగమ్మ.

అంతవరకు పిల్లలంటే విముఖంగా వుంటూ భార్య అంటే పెద్ద అభిమానం, ఆప్యాయత కనబరచని చంద్రం కూడా శకుంతలని అభిమానంగా చూస్తూ ఆవిడ ఆరోగ్యం గురించి ఒకటీ, అరా ప్రశ్నలు వేస్తున్నాడు.

యిన్నాళ్ళకు కూతురు కడుపు పండిందని సంతోషంతో తలమునకలవుతున్న శకుంతల పుట్టింటివారు గొప్పగా సారెతెచ్చి కూతుర్ని పురిటికి తీసుకువెళ్తామని కాంతమ్మను అడిగారు. వాళ్ళ కోరికని నిర్మొహమాటంగా నిరాకరించేసింది కాంతమ్మ. యీ స్థితిలో కోడల్ని విడిచి తనొక్క క్షణం కూడా వుండలేనని, తన మనుమడు తనింట్లోనే పుట్టాలని ఖచ్చితంగా చెప్పేసింది. మొదటి పురుడు పుట్టింట్లో పోసుకోకపోతే తాము గతిలేనివాళ్ళని నలుగురూ నవ్విపోతారని, శకుంతల తల్లి దీర్ఘాలు తీసింది. 'గాడిదగుడ్డు. ఎవరిష్టం వాళ్ళది' పొమ్మంది కాంతమ్మ. నలుగురూ ముక్కుమీద వేలేసుకునేలా ఒక పెళ్ళికి చేసినంత ఆర్భాటం చేసి కోడలికి సీమంతం చేసింది.

నెలలునిండిన కొద్దీ ఆపసోపాలు పడుతూ భారంగా తిరుగుతూంది శకుంతల. పురుడొచ్చే రోజుల్ని అస్థిమితంగా లెక్కపెడుతూంది కాంతమ్మ. ఆరు తులాల కిరకంకణాలు కళ్ళ ముందుకదిలి రక్తపుపోటుహెచ్చి, గుండెదడ వచ్చి కన్ను మూత పడడం లేదు శాస్త్రులుగారికి.

పుట్టబోయే పిల్లవాడి గురించి రక రకాల సుందర స్వప్నాల్ని కంటున్న కాంతమ్మ శాస్త్రులు గార్ని పిలిచి పిల్లవాడి భవిష్యత్తు గురించి ఆతురతతో అడిగింది. శాస్త్రులుగారు ఏవేవో లెక్కలు కట్టి పిల్లవాడు ఫలానా నక్షత్రం, ఫలానా పాదంలో పుడతాడని, బాలారిష్టాలేమీ వుండవని, అన్నిక్లాసులు ఫస్టు క్లాసులో పాసవుతూ పేద్ద ప్రొఫెసరో, కలెక్టరో అయ్యే యోగం వుందని, రెండు చేతులా డబ్బు సంపాదిస్తాడని, ఆయుస్సు తొంభై సంవత్సరాల పైబిగువే అని చెప్పడంతో కాంతమ్మ బెలూన్‌లా ఉబ్బిపోయి రెండు గుమ్మడి కాయలు, పెద్ద గిన్నెడు మీగడపెరుగు, ఒక కేన్ నిండా జున్ను ఇచ్చి పంపింది. ఇవి కాక పూజలని, శాంతులని ఒక వందరూపాయలదాకా ఖర్చు చేయించాడు శాస్త్రులుగారు.

శకుంతలకి నెలలు నిండాయి. ఆ రోజు తెల తెల వారుతున్నప్పటి నుండి శకుంతలకి వంట్లో నలతగా వుంది. నడుము లాగుతూంది. రెండు మూడు విరేచనాలయ్యాయి. సన్న సన్నగా కడుపులో నొప్పికూడా మొదలయింది. ఇరుగుపొరుగు అమ్మలక్కలు వచ్చి చూచి తమకు తోచిన సలహాలిచ్చారు. ఒక అర[illegible] కస్తూరి తెప్పించి వేడి చెయ్యడానికని శ[illegible] మ్రింగించారు. మంగమ్మను పిలిపించ[illegible]ని అంటే 'ఇప్పట్నించీ ఎందుకు? క[illegible]. టీలనీ, భోజనమనీ లక్షవత్తులు వత్తించుకుంటుంది. నొప్పులు కొంచెం ఎక్కువయ్యాక పిలిపించొచ్చులే' అంది కాంతమ్మ.

బారెడు ప్రొద్దెక్కేసరికి నొప్పులు కొంచెం ఎక్కువయ్యాయి. తిన్న అన్నం వాంతి చేసుకుంది శకుంతల. గుండె దడగా, ఆయాసంగా వుంది. ఉరికంబాన్నెక్కబోయే ముద్దాయిలా ఉద్రిక్తంగా వుంది శకుంతల పరిస్థితి. మంత్రసాని మంగమ్మకు కబురెళ్ళింది. ఆఘమేఘాల మీద వచ్చింది మంగమ్మ. బొడ్డు కోయడానికి క్రొత్త బ్లేడ్ తెప్పించింది. ఆముదం అడిగి తీసుకుని చేతికి రాసుకుని శకుంతల వడి కట్టులో చెయ్యి పెట్టి అటూ, యిటూ కెలికింది. ఎంతటి బాధనీ నోరు విప్పకుండా ఓర్చుకునే శకుంతల ఆ బాధకు తట్టుకోలేక విలవిలలాడుతూ కేకలు పెట్టింది. కోడలి కష్టం చూచి కాంతమ్మ కన్నీళ్ళెట్టుకుంది.

సాయింత్రమైనా నొప్పులు వస్తూనే వున్నాయి, మంత్రసాని మంగమ్మ పరీక్షలతో వడి కట్టు వాచిపోయింది కాని పురుడు రాలేదు. కరచరణాలాడక తిరుగుతూంది కాంతమ్మ. దానికి తోడు

అవకాశం దొరికిందికదా అని నలుగురూ నాలుగు మాటలంటున్నారు. కూతుర్ని పురిటికి తమ యింటికి పంప లేదని శకుంతల తల్లి కోపగించి రాలేదు. 'నే నెరగకపోయి పురిటికి ఇక్కడ వుంచాను. వాళ్ళ వాళ్ళుంటే అదో ధైర్యంగా వుండేది. ఏం దారిరా భగవంతుడా' అని గుంపు చింపులు పడిపోతూంది కాంతమ్మ.

రాత్రయిన కొద్దీ శకుంతలకు నీరసం, ఆయా సమూ ఎక్కువయాయి. మంగమ్మను నమ్ముకుని వూరుకుంటే బిడ్డ మాట దేవుడెరుగు. పెద్ద ప్రాణానికే ముప్పు వస్తుందో ఏమో – పట్నం తీసుకు పొమ్మని సలహా యిచ్చిందో పెద్ద ముత్తయిదువు. చేసేదిలేక టూరింగు కారు కోసం పంపారు. ఈ లోపు విభూతి నుదుటిన మెత్తారు. కొబ్బరికాయ దిగదుడుపు తీసి కొట్టారు. గద్దెకు వెళ్ళి ఏదైనా గాలి సోకి పురుడు రానీయకుండా చేస్తూందేమోనని ప్రశ్న అడిగి వచ్చారు. ఎవరికి తోచినట్లుగా వాళ్ళు మాట్లాడుతూ, ఎవరికి తోచిన చిట్కాలు వారు చెప్తూంటే కాంతమ్మకు మతిపోతోంది. ప్రక్కింటావిడ అత్తకు, కోడలికి ధైర్యం చెప్పి శకుంతల వంటి మీదున్న చీరమార్పించి రెండు చీరలు, పాత గుడ్డ[illegible] సంచిలో సర్దింది. ఫ్లాస్కు నిండా [illegible]ంది. తను వాళ్ళ కూడా వస్తానని, [illegible]వ్యంగా జరుగుతాయని చెప్పి ఊరడించింది.

దార్లోనే పురుడెక్కడ వస్తుందోనని ఖంగారు పడ్డారు — కాంతమ్మ, ప్రక్కింటి జానికమ్మ. ముందు సీట్లో కూర్చున్న చంద్రానికి మాత్రం యీ హడావిడంతా చూస్తూంటే మహా చిరాగ్గా వుంది.

తీరా నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళేప్పటికి భర్తతో పిల్లలతో కలిసి సినిమాకు వెళ్ళింది డాక్టరమ్మ. నర్సు సినిమాహాల్‌కి ఫోన్ చేసింది. 'ఎనీమా' యిచ్చి, ఒక 'బి. ట్వెల్వ్' యింజక్షన్ చెయ్యమంది డాక్టరమ్మ. మొదటి కానుపు కనుక, అదీ చాలా రోజులకు వచ్చింది కనుక లేట్ అవుతుందని, కంగారేంపడక్కర్లేదని, ఎలాగూ ఒక గంటలో సినిమా అయి తను వచ్చేస్తుంది కనుక చెయ్యవలసింది చేస్తుందని చెప్పమంది పేషెంట్ తాలూకు వాళ్ళతో. ఒకవేళ యిప్పుడే డెలివరీ అయేలా వుంటే బిడ్డ తల కనిపించేప్పుడు తనకు మళ్ళీ ఫోన్ చెయ్యమని, వెంటనే వస్తానని చెప్పింది.

డాక్టరమ్మ లేదనగానే సగం చచ్చిపోయిన వాళ్ళు డాక్టరమ్మ పంపిన సందేశం విన్నాక పూర్తిగా చచ్చిపోయారు. ఆ ఊళ్ళో మరో లేడీ డాక్టర్ లేకపోవడంవల్ల, మగ డాక్టర్ దగ్గరికి వెళ్ళడానికి యిష్టం లేకపోవడంవల్ల డాక్టర్ వచ్చే వరకు ఆదుర్దాగా అటూయిటూ తిరగడం తప్ప ఏం చేయలేకపోయారు.

పొరుగూర్లో పెళ్ళి చేయించడానికి వెళ్ళివచ్చిన శాస్త్రులుగారికి విషయం తెలిసి హుటాహుటిన నర్సింగ్‌హోమ్‌కి వచ్చిపడ్డాడు. ఆరు తులాల బంగారం అలా అలా కళ్ళ ముందు కదిలి మాయమవుతూంది. నర్సింగ్‌హోమ్‌కి వచ్చాక కాంతమ్మ ఏడ్పులూ, మొత్తుకోళ్ళూ విని మళ్ళీ పంచాంగం తీసి, లెక్కలుకట్టి తూర్పు తెల్లవారేసరికి శుభ లగ్నంలో సుఖప్రసవం అవుతుందని, ఖంగారు పడొద్దని ధైర్యం చెప్పాడు.

డాక్టరమ్మ కారు ఆగేసరికి ఆదరా, బాదరా కారు దగ్గరికి పరుగెత్తాడు శాస్త్రులు. 'అమ్మా! తమ కోసమే ఎదురుచూస్తున్నాం. అమ్మాయిని పరీక్ష చేసి త్వరగా ప్రసవమయేలా యింజక్షన్ యివ్వు తల్లీ!' అని ఆవిడకు నమస్కరించాడు.

"మీ అమ్మాయండీ పురుటికొచ్చినావిడ?" ఆప్యాయంగా ప్రశ్నించింది డాక్టరమ్మ

"కాదుతల్లీ! వారింటి పురోహితుడ్ని నేను. ఆ పిల్ల పెళ్ళికి లగ్నం పెట్టింది నేను. ఈ అమ్మాయి సరిగ్గా యీ టైమ్‌లోనే పండంటి మగ పిల్లాడినెత్తుకుంటుందని జోస్యం చెప్పింది నేను. అమ్మా! స్వోత్కర్ష, పరనింద కూడదంటారు. నా గురించి చెప్పుకోకూడదు కాని నా నోటంట మాటవస్తే అలా జరిగిపోవాల్సిందే. మనలో మనమాట. యీ అమ్మాయికి మగబిడ్డ పుడితే నాకు ఆరుతులాలు పెట్టి బంగారపు కంకణాలు చేయిస్తానంది ఆ వెర్రి బాగుల అత్తగారు" లేబర్ రూమ్ వరకు డాక్టర్‌ను అనుసరిస్తూ అసలు విషయం సెలవిచ్చారు శాస్త్రులుగారు.

డాక్టరమ్మ శకుంతలని పరీక్ష చెయ్యడానికి లోపలికి వెళ్ళి మిగతావాళ్ళందరిని బయటకు పంపేసింది. శకుంతల ముఖం చూడగానే గుర్తించింది డాక్టరమ్మ. పలకరింపుగా చిన్నగానవ్వింది.

"ఏమ్మా! ఏకంగా పురుటికే వచ్చావన్నమాట. వెరీగుడ్." బి. పి. చూస్తూ అంది డాక్టరమ్మ. బి. పి. ఎక్కువగా వుండడంతో చకచకా పొట్ట పరీక్ష చేసి, లోపలి పరీక్ష చెయ్యడానికి గ్లవ్ తీసుకుంది డాక్టర్. వాచిపోయిన పడికట్టును చూచి కఠినంగా మారింది డాక్టర్ ముఖం. ఎంత సున్నితంగా పరీక్ష చేసినా శకుంతల పడ్డ బాధ చూచి–బాధతో, జాలితో కరిగిపోయింది డాక్టర్. మళ్ళీ ఒకసారి పొట్ట పరీక్ష చేసి, నెల తప్పిన దగ్గర్నుండీ ఎప్పుడెలా వుందీ వంద ప్రశ్నలు వేసింది. అతి నిస్త్రాణతోపడివున్న శకుంతలని జాలిగా చూచి కాంతమ్మను పిలిచి కొంచెం కాఫీ పట్టించమంది.

"అయ్యో! యిలా వుందని నర్సు చెప్ప లేదమ్మా! అనవసరంగా మరొక గంట నిన్ను బాధపెట్టాను." తను వెంటనే వచ్చి పరీక్ష చెయ్యనందుకు నొచ్చుకుంది డాక్టరమ్మ.

చేతులు టవల్‌తో తుడుచుకుంటూ కుర్చీలో కూర్చుంటున్న డాక్టరమ్మ దగ్గరకు ఆదుర్దాగా వచ్చారు జానికమ్మ, చంద్రం, శాస్త్రులుగారు.

"ఏమ్మా! పురుడు సవ్యంగా వస్తుందా" శాస్త్రులు అడిగాడు.

"పురుడేమిటండీ మహానుభావా, అసలు కడుపేకానిదే పురుడెక్కడి నుండి వస్తుందండీ?" శాస్త్రులువంక చిరాగ్గా చూచింది డాక్టరమ్మ.

"ఏమిటీ, అసలు కడుపే కాదా?" ప్రక్కలో బాంబుపేలినట్లయింది అందరికీ.

"కడుపు కాకపోతే, మరి, యీ గర్భిణీ చిహ్నాలన్నీ ఏమిటమ్మా!" అయోమయంగా డాక్టర్‌వైపు చూచింది జానికమ్మ.

"యిదేం ప్రారబ్ధంరా భగవంతుడా!" తల పట్టుకుని కూలబడిపోయింది కాంతమ్మ.

"అమ్మా! మాకేమీ పాలుబోవడం లేదు. యిదేమన్నా జబ్బా అమ్మా!" దుఃఖంతో పూడుకుపోయింది కాంతమ్మ స్వరం.

పేదరికానికి అజ్ఞానం, మూఢాచారాలు తోడవుతాయి సరే, కలవాళ్ళింట్లో పుట్టి కాస్తో, కూస్తో చదువు, సంస్కారం వున్న శకుంతల లాంటి అమ్మాయిలు కూడా పెద్దవాళ్ళ అర్థంలేని ఆంక్షలను ఎదిరించలేకపోతున్నారంటే ఆశ్చర్యమేసింది డాక్టర్‌కి. కాంతమ్మ లాంటి అమాయకుల్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్న శాస్త్రులు లాంటి వాళ్ళంటే మహా మంట డాక్టరమ్మకు. తన భార్యను సాటిమనిషిగా ఆదరించి, గౌరవించలేని చంద్రం లాంటి వెన్నెముకలేని యువకుల్ని చూస్తే చిరాకు డాక్టరమ్మకు. యథాలాపంగా, నిర్వేదంగా అందరి వంక చూస్తున్న డాక్టరమ్మ దృష్టి కాంతమ్మ దగ్గర ఆగింది. భరించలేని నిరాశతో క్రుంగిపోతున్న ఆవిడ ప్రశ్న విని వర్తమానంలోకి వచ్చింది డాక్టర్.

"యిదేమీ పెద్ద ప్రమాదకరమైన జబ్బు కాదమ్మా! పిల్లలు కావాలని బలమైన కోరిక వున్నవారికి, పిల్లలు అస్సలు వద్దనుకునేవాళ్ళకు 'సూడోసయిసిస్' అనే యిలాటి పరిస్థితివస్తుంది. అంటే 'అబద్ధపు గర్భిణి' అని అర్థం. యిది చాల అరుదుగా వస్తుంది. దీనికి కారణం మన శరీరంలో వుండే 'హార్మోన్లు' అనే పదార్థాలు బ్యాలన్స్ తప్పడం, నరాలు ఒక క్రమంలో పని చెయ్యకపోవడం. నేవిళ్ళు కాని, బిడ్డ కదలికలు కాని, పొట్టపెరగడం కాని, నొప్పులురావడం కాని ఆ వ్యక్తి మానసికస్థితికి అనుగుణంగా హార్మోన్సు లయతప్పి పనిచెయ్యడం వల్ల జరుగుతాయి." డాక్టర్ చెప్తానే వుంది, మతిపోయినట్లు చూస్తూ కూర్చున్నారు చంద్రం, కాంతమ్మ, జానికమ్మ. కరకంకణనిక్వాణానికి నోచుకోలేదని తెలియగానే స్పృహతప్పుతోంది శాస్త్రులుగారికి. అక్కడకు వచ్చి అంతా విన్న శకుంతల హృదయంలో మహారణ్యాలు తగలబడిపోతున్నాయి. నిస్పత్తువతో నేల మీద చతికిలబడి రెండుచేతుల్లో ముఖాన్ని దాచుకుంది శకుంతల. డాక్టర్ శకుంతల దగ్గరకు వచ్చింది. "చూడమ్మా! నువ్వేం దిగులు పడకు. అన్నిపరీక్షలూ చేసి నీకూ, మీ ఆయన గారికీ ట్రీట్‌మెంట్ యిస్తాను. తప్పకుండా నీకు పిల్లలు పుడతారు. ఒకవేళ పుట్టకపోయినా.... కీడెంచి మేలెంచమన్నారు కదా .... మనలోని మమకారాన్ని మరోదిక్కుకు తిప్పుకుని, మరో మంచిపని మీద మన శక్తిని కేంద్రీకరించకూడదా? నీలో ధైర్యం, శాస్త్రీయమైన దృక్పథం వుంటే జీవితంలోని ప్రతి సంఘటననీ ఎదుర్కొని, సమర్థించుకుని, సంతోషాన్ని పొందుతావు. అసలిదంతా ఎందుకు, నీకు పిల్లలు తప్పకుండా పుడతారు" సానునయంగా శకుంతలకు చెప్తూ ఆవిడని తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టింది డాక్టర్.

"మామ్మగారూ! మీ తరం మారింది. మీరు నమ్మిన ఆచారాలతో వీళ్ళను వెనుకే ఉంచేయక ముందుకు వెళ్ళనివ్వండి," అని కాంతమ్మతో అని చంద్రం వైపు తిరిగింది డాక్టర్.

"చూడండి. ఆ అమ్మాయికి మానసికమైన శక్తినివ్వాల్సిన బాధ్యత మీదే"

"సూడోసయిసిస్. ఇదెక్కడి వింతజబ్బురా బాబూ! నా కొంప మీదకు తెచ్చింది" అనుకుని డాక్టర్ తనవైపు చూచేలోగానే బయటకు జారుకున్నాడు శాస్త్రులు.

# విద్యార్థినుల శీర్షిక



ఇటీవల మద్రాసులో ప్రముఖ హాస్యనటుడు శ్రీ రాజ్‌బాబు జన్మదిన సందర్భంగా ఒక పదేళ్ళ అమ్మాయి చాణక్య పాత్ర ధరించి, ఏకపాత్రాభినయం చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఆ అమ్మాయి పేరు బి. పావని. వలమనేరులో ఏడవ తరగతి చదువుతున్న పావని తన నాలుగవ యేటనే కరీంనగర్‌లో లంబాడీ నృత్యం ప్రదర్శించి అక్కడి కలెక్టర్ ప్రశంసలు పొందింది. ఆ తర్వాత ఆమె హైదరాబాదులోని నృత్యాంజలిలో నాట్య శిక్షణ పొందింది; శ్రీమతి గిడుగు విశాలాక్షి వద్ద శిక్షణ పొందింది. నాట్యం చెయ్యడంలోనూ, నాటకాలలో వేషాలు వెయ్యడంలోనూ ఆసక్తి చూపే పావని ఎన్నో పోటీలలో పాల్గొని బహుమతులు సంపాయించింది. 1974 లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర నాట్యకళా పరిషత్తువారు 'నటనాలయం' నాటకంలో 'చిట్టి బాబు' పాత్ర ధరించిన పావనిని 'ఉత్తమ నటుడు'గా గుర్తించారు!

విజయవాడ మారిస్‌స్టెలా కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇటీవల హైదరాబాదులో ఒక నాట్య కార్యక్రమం సమర్పించి సభికుల మన్ననలు పొందారు. ఆనాటి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖామాత్యులు శ్రీ రాజమల్లు ముఖ్య అతిథిగా పాల్గొని, నాట్య కళాకారిణులను అభినందించారు.

ఆ నాట్య కళాకారిణులు–కుమారి హేమనళిని, కుమారి రమాదేవి. ఈ ఇద్దరూ 'విజయవాడ సిస్టర్స్'గా నాట్యాభిమానులకు పరిచితులు. ఈ సోదరీమణులు తమ బాల్యంలోనే కూచిపూడికి చెందిన శ్రీ బి. హెచ్. వై. శర్మ వద్ద శాస్త్రీయంగా నాట్యం నేర్చుకోనడం ప్రారంభించి 1967లో రంగప్రవేశం చే ·రు

వాళ్ళు ఆంధ్రప్ర... నాట్యోత్సవంలోనూ, అఖిల భారత సం... నాట్యాల పోటీలలోనూ పాల్గొని 1968, 69 సంవత్సరాలలో బహుమతులు సంపాయించారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో దాదాపు 250 నాట్య ప్రదర్శనలకు పైగా ఇచ్చి కూచిపూడి, భరతనాట్యాలలో తమ ప్రావీణ్యాన్ని ప్రకటించారు.

ప్రస్తుతం హేమ-బి.కాం (మూడవ సంవత్సరం) రమ-బి. ఏ. (రెండవ సంవత్సరం) చదువుతున్నారు.



Edited & Published by B. Viswanatha Reddi for CHANDAMAMA CHILDREN'S TRUST FUND (Prop. of Chandamama Publications) & Printed by B. V. REDDI at Prasad Process Private ...